



కెవిఆర్ కాలేజీ జాబ్‌మేళా సందర్భంగా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి భరత్

పిల్లల పండగకు సర్వం సిద్ధం

• నేటి నుంచి 5వ కర్నూలు బాలోత్సవం • మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో నిర్వహణ • హాజరుకానున్న 2,500 మందికిపైగా విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు బాలోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళ, బుధవారాల్లో జరగనున్న ఈ వేడుకలకు కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదిక కానుంది. దాదాపు 2,500 మందికి పైగా విద్యార్థులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదా యాలను తెలియజేసే విధంగా ప్రతేడాది కర్నూలు బాలోత్సవ కమిటీ రెండు రోజులపాటు ఉత్సాహ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తోంది. వరుస గా ఐదోసారి కర్నూలు బాలోత్సవ సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో కర్నూలు డివిజన్ పరిధిలోని 250పైగా పాఠశాలలు పాల్గొంటున్నా యి. దాదాపు 2,500 మందికిపైగా విద్యార్థులు రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. మొదటి రోజు వేడుకలను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. బాలోత్సవాల నిర్వహణకు నాలుగు వేదికలు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కల్యాణమ్మ పేరుతో, రెండో వేదిక కర్నూలు బాలోత్సవం కమిటీ పూర్వ ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య పేరుతో, మూడో వేదిక స్వతనారాయణరెడ్డి పేరుతో, నాలుగో వేదికను కళావేదిక పేరుతో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డ్యాన్స్, సింగింగ్ పోటీలతోపాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు. మొత్తం 35 రకాల ఈవెంట్లను నిర్వహించనున్నారు. గత బాలోత్సవం కంటే ఈ సారి మరింత ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం అధ్యక్షులు జంద్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ తెలిపారు. బాలోత్సవ వేడుకల్లో విద్యార్థులు భాగస్వామ్యమ య్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

కార్యక్రమాలు ఇలా..

కర్నూలు బాలోత్సవంలో భాగంగా తొలి రోజు మంగళవారం ఉదయం ప్రారంభ సభ నిర్వహించనున్నారు. అనంతరం శాస్త్రీయ నృత్య పోటీలు, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ వ్యాసరచన, వక్తృతం పోటీలు, కథా రచన, కవితా రచన, పద్యం భావం, వార్తా రచన, మ్యాప్ పాయింటింగ్, వినతిపత్రం రాయడం, స్పెల్-బి, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, విచిత్ర వేషధారణ నిర్వహించనున్నారు. రెండో రోజైన బుధవారం



చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడటం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యం బృంద పోటీలు, కోలాటం, సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. అనంతరం ముగింపు సభ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తారు.

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో
ఉపాధి అవకాశాలు

- కెవిఆర్‌లో జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ పారిశ్రామికవాడలోని యువతకు ఉపాధి అవకాశాలు పొందేందుకు చర్యలు తీసుకుం టున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని కెవిఆర్ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి టిజి. భరత్‌జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు 5 సంవత్సరాలలో కల్పించే ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నామని తెలిపారు. కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాలలో గతంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 950 మంది పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఇప్పుడు 1550 ఉద్యోగాలను 21 సంస్థల ద్వారా కల్పించే చర్యలు తీసుకున్నామన్నారు. రూ.500 కోట్ల పెట్టుబడితో డ్రోన్ పరిశ్రమ, ఫైవ్ స్టార్‌హోటల్ వస్తున్నవని వాటికి సంబంధించిన నైపుణ్యం యువతకు కలిగి ఉండాలన్నారు.. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంత్రి టిజి. భరత్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కళాశాలలో పోలీసు వారు ఏర్పాటుచేసిన కర్నూలు నగర ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌దీప్తి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆనంద్ రాజకుమార్ , కెవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి , బొందెల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, స్పార్క్స్ ఇంచార్జ్ గిరిరాజ్, రవి పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రయివేట్ బ్యాంకుల కుట్రలకు యువత బలి

- పరిశ్రమల కేంద్రం ముందు కెవిపిఎస్, డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దళితులను యువ పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామంటున్న ప్రభుత్వాల హామీ హామీలుగానే మిగిలిపోతున్నాయని, పారిశ్రామికవేత్తలుగా తయారై 10 మందికి ఉపాధి చూపించాల్సిన యువతీ యువకులు ప్రైవేట్ బ్యాంకుల కుట్రలకు బలై నిండా అప్పుల్లో మునుగుతున్నారని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు విమర్శించారు. సోమవారం కర్నూలు నగరంలోని బి క్యాంప్ వద్ద ఉన్న జిల్లా పరిశ్రమల కేంద్రం ముందు కెవిపిఎస్, డివైఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్లా, కాటి కాపరుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. దళితుల్లో పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న లక్ష్యానికి ప్రైవేట్ బ్యాంకులు తూట్లు పొడుస్తున్నాయని, పర్యవేక్షించాల్సిన అధికారులు సబ్సిడీని బ్యాంకులకు విడుదల చేసే వరకే మా పని అన్నట్లుగా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయన్నారు. నగరంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ దళిత యువ పారిశ్రామికవేత్తల రక్తం జుర్రుకుంటూ మానసిక వేదనకు గురి చేస్తోందన్నారు. మూడు నెలలు కంతులు కట్టకపోతే సీజ్ చేయాల్సిన బండిని నెలకే ఆపి, పని జరగకుండా మరో నెల రోజులు పక్కన పెట్టించి, తీరా మూడు నెలలు చేసి, అప్పటికి వడ్డీతో కలిపి అప్పు కడతామన్న ఒప్పుకోకుండా మొత్తం కట్టాల్సిన అప్పును చెల్లిస్తేనే బండిని విడుదల చేస్తామంటూ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టి ఉన్న ఆస్తినంతా అమ్మించి కంతుల వ్యవధి ఉండగానే అప్పు కట్టించుకున్నారన్నారు. అప్పుచెల్లించాక ప్రభుత్వం నుండి పడ్డ నాలుగు లక్షల సబ్సిడీని ఇవ్వడానికి సైతం రెండు లక్షలు లంచం అడిగారన్నారు. మరో బాధితుడికి మొత్తం కంతులు అయిపోయి ఎన్ఒసి ఇచ్చినా ఇప్పటికీ రూ.1,50,000 డ్యూ ఉన్నట్లుగా చూపిస్తోందన్నారు. ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజర్ , లీగల్ టీం హెడ్‌లు దళితుల పట్ల చులకనా భావంతో మాట్లాడుతూ అవమానపరుస్తున్నారన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన మొత్తం సబ్సిడీని ఇప్పించడంతోపాటు ఇప్పటికే బ్యాంకుల్లో వేసిన మొదటి దఫా సబ్సిడీని లబ్ధి లబ్ధిదారులకు ఇచ్చేలాగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మరింత పెద్ద ఎత్తున లబ్ధిదారులందరినీ కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్ బాషా, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, నగర అధ్యక్షులు ఆర్. రమణ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అంజి, నగర ఉపాధ్యక్షులు పృధ్వి తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమ కేంద్రం ముందు ధర్నా చేపడుతున్న నాయకులు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

జస్టిస్ చంద్రు
సెమినార్‌ను జయప్రదం చేయండి

- బార్ అసోసియేషన్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, వివిధ లాయర్ల సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

'రాజ్యాంగం సవాళ్లు - పౌరుల బాధ్యత అనే అంశంపై ఈ నెల 13న ఉదయం 11 గంటలకు కర్నూలు టీజీవి కళాక్షేత్రంలో నిర్వహించే సెమినార్‌కు జై భీమ్ సినిమా రియల్ హీరో, మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, వివిధ లాయర్ల సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం కర్నూలు కోర్టు ఆవరణంలో కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక గౌరవ సలహాదారు సీనియర్ న్యాయవాది జయరాజు, కన్వీనర్ నరసింహ, ఐలు జాతీయ నాయకులు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ప్రజాహిత వేదిక కన్వీనర్ మురళి, కర్నూలు బాలోత్సవం కార్యదర్శి ధనంజయ, లాయర్లు రవికాంత్, సుమంత్, హైమావతి, ముంతాజ్ బేగం, సుబ్బయ్య, రాజేష్, నిత్యజీవరాజు, శ్రీనివాసులు, రవిరాజు, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

నాలుగు శాఖల సమస్యలే అత్యధికం

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవిన్యూ మున్సిపల్ పంచాయతీరాజ్ సర్వే శాఖలకు సంబంధించి సమస్యలు ఎక్కువగా గ్రీవెన్స్ లో అత్యధికంగా వస్తున్నయని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. ఈ శాఖలకు సంబంధించిన పనులను మరింత వేగవంతంగా చేస్తే సమస్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పిజిఆర్ఎస్ ద్వారా అర్జీలను మరింత సమర్ధవంతంగా పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమించడం జరుగుతోందన్నారు. ప్రీ-ఆడిటింగ్ బృందాల ద్వారా అర్జీల పరిష్కారంలో నాణ్యతను పెంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్న క్యాంటీన్లను రోజూ ఉదయం, సాయంత్రం పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల్లో సుమారు 450 మంది పాఠశాలకు గైర్హాజరయినట్లు గుర్తించామన్నారు. వంద రోజుల ప్రత్యేక విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. డ్రాపౌట్ అయినా ప్రతి విద్యార్థి కూడా పాఠశాలకు తిరిగి చేరే వరకు అధికారులు ఫాలో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి 10వ తరగతి పాస్‌అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, కొండయ్య పాల్గొన్నారు.

ఆధునిక స్కిల్ ల్యాబ్ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో జాన్సన్ అండ్ జాన్సన్ ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్ ఆధ్వర్యంలో స్కిల్ ల్యాబ్ శిక్షణలో శస్త్ర చికిత్సకు సంబంధించిన అంశాలపై ఆరోగ్య నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు అధునాతన వసతులతో కూడిన ప్రత్యేక బస్సును కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కెఎంసి, ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో పీజీలు, వైద్యవిద్యార్థులకు ఈ బస్సులో వివిధ అంశాలకు సంబంధించిన శిక్షణ ఇస్తారన్నారు. ఈ బస్సు రెండు రోజులపాటు ఓల్డ్ గైనిక్ బ్లాక్ వద్ద, 8, 9వ తేదీల్లో ఉంటుందన్నారు. సాధారణ, లాప్రోస్కోపిక్, గైనకాలజీ, యురాలజీ, పీడియాట్రిక్స్ శస్త్రచికిత్స వంటివి నేర్చుకోవచ్చన్నారు. డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వాఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో జాన్సన్ అండ్ జాన్సన్ ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్ ఆధారిత స్కిల్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమం 8, 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సా పద్ధతులపై ప్రత్యక్ష శిక్షణ ఇస్తారని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం పీజీ ట్రైనీలు, జూనియర్ సర్జన్ల శస్త్రచికిత్సా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా కలిగి ఉందన్నారు.



బాలసదన్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎమ్మెల్యే గౌరుచరిత

విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి

-మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. సోమవారం పెద్దపాడులో దామోదరం సంజీవయ్య బాల సదనాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సందర్శించారు. చిన్నారులు, వసతి గృహ అధ్యాపకులు చైర్‌పర్సన్‌కు ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బాల్యవివాహాల నివారణ అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైర్‌పర్సన్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. తదనంతరం వసతి గృహంలోని డైనింగ్ హాల్, వంటగది, స్టోర్‌రూమ్, విద్యార్థుల పడక గదులను పరిశీలించి అందిస్తున్న సదుపాయాలపై సమగ్రంగా ఆరాతీశారు. విద్యార్థులతో ప మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న వసతులు, భోజనం, చదువు, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, బాల సదనం లో 48 మంది పిల్లలు ఉన్నారని, వారికి మెరుగైన వసతులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాల్య వివాహాలు చేయకూడదని, ఈ మేరకు తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ రోహిణి, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ - జరిమానా

ప్రజాశక్తి- సి బెళగల్

ముడుమాల గ్రామంలో ఎస్ఐ వేణుగోపాల్ రాజు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇక్కడే కేపాసిటీకీ మించి ప్రయాణికులకు ఎక్కించుకున్న వాహనాలకు, శృతి మించిన లోడు వేసుకున్న వాహనాలకు జరిమానా విధించారు. అలాగే రోడ్డు భద్రత నియమాలపై వాహన దారులకు అవగాహన కల్పించారు. ఇక్కడే హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణ కవచమని పేర్కొన్నారు.

కెఎల్ యూనివర్సిటీ కృషి బాగుంది

-క్యాంపస్ లోనే పరిశ్రమల ఏర్పాటు మహోన్నతం - రాష్ట్ర మంత్రి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్యాంపస్ లోనే పరిశ్రమల ఏర్పాటు అత్యంత హర్షణీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. ఇంటర్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాశం , ఉన్నత లక్ష్యాలు అంశంపై తాండ్రపాడులోని శ్రీ చైతన్య బాలుర హాస్టల్ క్యాంపస్‌లో సోమవారం కెఎల్ యూనివర్సిటీ, శ్రీ చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య మాట్లాడారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాలకు నైపుణ్యాభివృద్ధి అత్యంత ఆవశ్యకమన్నారు. కె ఎల్ యూనివర్సిటీ లో ఇందుకోసం అమలుచేస్తున్న ప్రణాళికలను ప్రశంసించారు. క్యాంపస్ ఆవరణలోనే పరిశ్రమల ఏర్పాటు వల్ల విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాట్లకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలు ఎన్నో రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్నాయని తద్వారా యువతకు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. కె ఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ సమకాలిన విద్యా విధానాలపై సోదాహరణంగా విశ్లేషించారు. జీవితంలో ఉన్నత విద్య అత్యంత విలువైనదన్నారు. నాలుగేళ్ల విద్యా ప్రయాణంలో నేర్చుకోవటానికి ఎన్నో అంశాలు ఉంటాయాని అన్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. తద్వారా సృజనాత్మక ఆలోచన శక్తి పెంపందుతుందని పేర్కొన్నారు. తమ యూనివర్సిటీ పరిశోధనలకు అగ్ర ప్రాధాన్యం ఇస్తోందని క్యాంపస్ ప్లేసెమెంట్లలో రికార్డులు సృష్టిస్తోందని, తమ విద్యార్థి రూ.75 లక్షల అత్యధిక ప్యాకేజీతో ప్లేసెమెంట్ పొందినట్లు వివ రించారు. 16 సంవత్సరాలుగా అర్హులైన విద్యార్థులకు 100శాతం క్యాంపస్ ప్లేసెమెంట్స్ అందిస్తున్నా మన్నారు. 2025 విద్యా సంవత్సరంలో 8000 మందికి పైగా విద్యార్థులకు క్యాంపస్ ప్లేసెమెంట్స్ ఆఫర్స్ లభించాయని పేర్కొన్నారు. తమ విద్యార్థులు శాటిలైట్స్ ప్రయోగాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారాని చెప్పారు. క్యాంపస్ ప్రాంగణంలోనే కంపెనీల ఏర్పాటు చేస్తున్నామని, మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా రూ.100 కోట్ల విలువైన స్కాలర్షిప్స్ ద్వారా ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కెఎల్ యూనివర్సిటీ రాయలసీమ జోనల్ హెడ్ కేశవ గౌడ్, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎజిఎం మురళీ కృష్ణ, డీన్ బాలాజీ, జోనల్ ఇంచార్జి కృపారాజు పాల్గొన్నారు. జూనియర్ ఇంటర్ లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్ అందచేశారు.



కెఎల్‌వర్సిటీ,శ్రీచైతన్యవిద్యాసంస్థల బ్రోచర్ విడుదల చేస్తున్న మంత్రి

నగరాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరాభివృద్ధికి పెద్దపీట వేసినట్లు నగరపాలక సంస్థ స్థాయి సంఘం చైర్మన్, మేయర్ బివై.రామయ్య అన్నారు. సోమవారం నగరపాలక సమావేశ భవనంలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. 22 అంశాలకు ప్రవేశపెట్టగా 4 తీర్మానాలకు ఆమోదం తెలిపి, 18 అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో కమిషనర్ పి.విశ్వనాథ్, సభ్యులు షేక్ అహ్మద్, సాంబశివరావు, మునెమ్మ, నారాయణ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఎంఇ మనోహర్‌రెడ్డి, ఆర్ఒ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు

సుప్రీంకోర్టు ఎబిసి నిబంధనల ప్రకారం వీధి కుక్కలకు ఆశ్రమ కేంద్రం (స్టెరిలైజేషన్ సెంటర్) కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం సర్వే నం.362లో సరిహద్దు గోడతో కూడిన శాశ్వత ఆశ్రయం నిర్మించేందుకు రూ.25 లక్షలు కేటాయించారు. కల్లూర్ మండలం బస్తిపాడు గ్రామంలో వీధి పశువులు, జంతువుల కోసం జిఐషెడ్, సరిహద్దు రక్షణ గోడ, సరిహద్దు రక్షణ అవసరమైన సౌకర్యాలతో కూడిన ప్రత్యేక ఆశ్రయం ఏర్పాటుకు రూ.25.00 లక్షలను కేటాయించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగింపు డెమోలిష్ స్క్వాడ్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన 12 మందికి 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఏడాది వేతనాలను రూ.30 లక్షలు కేటాయించారు.

సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -పత్తికొండ

సహకార సంఘ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కెడిసిసి బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాకు సిపిఎం , ఎపి రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. రామచంద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘ ఉద్యోగులకు రూ.ఐదు లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. సహకార సంఘ ఉద్యోగులు సర్వీసులో మరణిస్తే, ఆ ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ భరోసా ఇవ్వాలన్నారు. సహకార సంఘాల ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. 2019 తర్వాత సహకార సంఘాలలో చేరిన ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. జీవో నెంబర్ 36 ను అమలుపరిచి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చే రుణాలు డిసిసిబి ల ద్వారా కాకుండా పిఎసిఎస్ ల ద్వారా అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దతు తెలిపిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర, సహకార సంఘాల సిఇఒలు ఏసు ప్రవక్త, రహంతుల్లా, గిడ్డయ్య, మండల సహాయ కార్యదర్శి జోలాపురం కాసిం, మద్దిలేటి, మనోహర్ నాయుడు, మల్లికార్జున, ఎర్రిస్వామితదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతన్న చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

సోలార్ పరిశ్రమను నెలకొల్పొద్దు

కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమను నెలకొల్ప రాదని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మించాలని గ్రీన్ కో కంపెనీ ఏర్పాటుకు ముందుకు రాగా ప్రజలు వ్యతిరేకించడంతో వెనక్కి పోయిందన్నారు. సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే గ్రామాన్ని మొత్తం ఖాళీ చేయాల్సి ఉందన్నారు.. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గ్రామమంతా ఒకవైపు ఉందని పేర్కొన్నారు. వెంటనే స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు జరుగుతున్న సన్నాహాలను విరమించుకునే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామనిహెచ్చరించారు. రైతు సంఘం జిల్లా నాయకులు జి ఆంజనేయులు, స్థానిక రైతులు మహబూబ్‌బాష, రామకృష్ణ, ఎల్లారాముడు తదితరులు పాల్గొన్నారు.



నేడు డ్రగ్స్ కంట్రోల్ డిడి ఆఫీస్, ప్రాంతీయ ఔషధ పరీక్ష ప్రయోగశాల ప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని రెడ్ క్రాస్ భవనం పక్కన నిర్మించిన ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయన్ని , ప్రాంతీయ ఔషధ పరీక్ష ప్రయోగశాలన్ని ఆన్‌లైన్ ద్వారా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్, మంత్రి టిజి. భరత్ ప్రారంభించనునట్లు ఆ శాఖ డిడి సిహెచ్ నాగకిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15.53 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనానికి రూ.1.79 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో ఏడాదికి 1500 నమూనాలను పరీక్షించే సామర్థ్యముందన్నారు. ప్రయోగశాల ప్రారంభం, నిర్వహణతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తీసుకున్న ఔషధ నమూనాల నాణ్యతను నిర్ణయించడానికి విశ్లేషణ జరుగుతుందన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఫిబ్రవరి చివరి వరకు నీరివ్వాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

తుంగభద్ర దిగువ కాలువకు ఫిబ్రవరి చివరి వరకు సాగునీరిచ్చి మిరప రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఉపాధ్యక్షులు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఎల్‌ఎల్‌సి పరిధిలో రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మిరప పంట పూత దశలో ఉందని, ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు తుంగభద్ర డ్యాంకు పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నందున జనవరి 10వ తేదీ వరకే పంటలకు సాగునీరు అందిస్తామని చెప్పారని, జనవరి 10లోపు మిరప పంట చేతికొచ్చే అవకాశం లేదని తెలిపారు. ఆలోపు కనీసం విత్తనాల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కనీసం ఫిబ్రవరి ఆఖరి వరకు మిరప పంటకు సాగునీరందిస్తే 70 శాతం పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పెట్టిన పెట్టుబడులైన రైతులకు అందే పరిస్థితి ఉంటుందని చెప్పారు. గతేడాది పంట ఎక్కువగా వచ్చినప్పటికీ ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈసారి ఎంతోకొంత ధర ఉంటుందని ఆశతో తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేస్తే జనవరి 10 తర్వాత నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. మిరప రైతులను దృష్టిలో పెట్టుకొని ఫిబ్రవరి ఆఖరి వరకు సాగు నీరందించాలని కోరారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు బాష, ఈరన్న పాల్గొన్నారు.

విద్యుత్, విత్తన బిల్లులతో

వ్యవసాయంపై ప్రభావం : రైతుసంఘం

ప్రజాశక్తి - మంత్రాలయం


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విద్యుత్, విత్తన బిల్లులతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.వీరేష్ తెలిపారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఎఐకెఎస్ ఆధ్వర్యంలో మండలంలోని సూగూరు గ్రామంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్, విత్తన బిల్లులతో ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలన్నీ ప్రయివేట్ పరం అవుతాయని తెలిపారు. రైతులకు వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఉండదని హెచ్చరించారు. దళిత, గిరిజనులు, వివిధ సామాజిక తరగతుల పేదలు, బలహీన వర్గాలకు విద్యుత్ రాయితీ, చిన్న, చిన్న పరిశ్రమలకు విద్యుత్ రాయితీ ఉండదని తెలిపారు. గృహ వినియోగదారులపై ఇప్పటికే ఉన్న విద్యుత్ చార్జీలకు అదనంగా మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, విత్తన బిల్లులను వెంటనే ఆపాలని, లేకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్, విత్తన బిల్లుల ప్రతులను దహనం చేశారు. రైతు సంఘం నాయకులు కె.యోగప్ప, రైతులు ఖాసీం, బ్రహ్మయ్య, నాగేష్, తిక్కన్న, మల్లప్ప పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక' హామీని అమలు చేయాలి

- భవన నిర్మాణ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసి కొరత తీర్చాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు నాయకులు పిఎస్.గోపాల్, బి.తిప్పన్న, పి.ఈరన్న, డి.లక్ష్మన్న మాట్లాడుతూ... ఉచిత ఇసుక ఇస్తామని గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి వస్తోందని, ప్రజలకు కూడా ఖర్చు ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఇలాంటి అనుమతులూ లేకుండా ఇసుక డంపు యార్డును ఏర్పాటు చేసి అధిక ధరకు అమ్ముతున్నారని తెలిపారు. ఇసుక సమస్యపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి.. గతంలో ఉన్న బిఒఎల్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, మల్లికార్జున, వీరేష్, తిక్కప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జి.ఈరన్న, బి.ఈరన్న పాల్గొన్నారు.

మహారాష్ట్రకు 'తెల్ల బంగారం'

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తెల్ల బంగారంగా పేరుగాంచిన పత్తి పంటను దళారులు మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తరలిస్తున్న దళారులపై సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ రూపాల్లో మార్కెట్ యార్డు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెండో ముంబయిగా పేరుగాంచిన ఆదోని మార్కెట్ యార్డుకు పత్తి పంట రాకుండా మహారాష్ట్ర నుంచి వచ్చిన దళారులు అడ్డుకట్ట వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతులకు మాయమాటలు చెప్పి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. కోసిగి, కౌతాళం మండలాల్లోని గ్రామాల్లో అక్కడే మకాం వేసి పగలు, రాత్రి లారీల్లో రాష్ట్రాల సరిహద్దులను దాటిస్తున్నారు. వివిధ పన్నులు చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న మరాఠా వ్యాపారులపై 'డేగ' కన్ను వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

వ్యాపారం సాగుతుందిలా..!

మహారాష్ట్ర నుంచి పత్తి వ్యాపారులు కోసిగి, కౌతాళం మండలాల్లో చిన్న గ్రామాలను ఎన్నుకుంటారు. కొంతమంది కమీషన్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా పత్తి రైతులను పరిచయం చేసుకుంటారు. 'మీ పత్తి పంటకు మంచి ధర ఇస్తున్నాం. మీరు పంటను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్తే అయ్యే ఖర్చులు మిగులుతాయ'ని నమ్మించి ఒప్పందం కుదుర్చుకుంటారు. ఇంటి వద్దనే తూకాలు వేసి,


పత్తిని తూకం వేస్తున్న కూలీలు

డబ్బులు చెల్లించి పంటను లారీల ద్వారా తీసుకెళ్తున్నారు.

తూకాల్లో మోసం..?

రైతుల నుంచి పత్తి పంటను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 50 కిలోల్లో తూకాలు చేస్తున్నారు. ఇలా తూకాలు చేయడం వల్ల మోసం జరుగుతుందని కొంతమంది రైతులు పేర్కొంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని లారీల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు. ఎలాంటి పన్నులూ చెల్లించకుండా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. కౌతాళం, కోసిగి మండలాల నుంచి మాధవరం చెక్‌పోస్టు ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో ఉన్న అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో పత్తి లారీలు సులభంగా ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయి. ఉన్నతాధికారులు మాధవరం చెక్‌పోస్టు వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా అరికట్టవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

సిసిఐ స్లాట్ బుకింగ్ కావడం లేదు

రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐలో స్లాట్ బుకింగ్ కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత్యంతరం లేక గ్రామాల్లోకి వచ్చిన మహారాష్ట్ర వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని ఎరిగేరి, పొదలకుంట, మదిరే గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

జిల్లా సాధనకు నడుం బిగించాలి

- సాధన సమితి జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధన కోసం ప్రతి పల్లె నుంచి నడుం బిగించాలని జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, కోదండ, నూర్ అహ్మద్, దేవిశెట్టి ప్రకాష్, టి.వీరేష్, ప్రకాష్ జైన్, అశోకానంద రెడ్డి, దస్తగిరి నాయుడు కోరారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలు కలిపి ఆదోని జిల్లాగా చేయాలని చేపట్టిన ఆందోళనకు సోమవారం 23వ రోజుకు చేరింది. పద్మశాలి సామాజిక వర్గం బుదారపు లక్ష్మణ, చిలకా శేఖర్, బి.నాగరాజు, చిలకా కృష్ణ, గంజి వీరభద్ర స్వామి, జెరుబండి కృష్ణమూర్తి, రామాంజనేయులు, మార్కండేయ స్వామి దేవాలయంలో పూజలు చేసి ర్యాలీగా వచ్చి దీక్షలో కూర్చున్నారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు ర్యాలీగా వచ్చి మద్దతు తెలిపారు. ఆదోని జిల్లా చేస్తే తమకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి లభిస్తాయంటూ చిన్మయ విద్యాలయం విద్యార్థులు భారీ ర్యాలీతో నినాదాలు చేశారు. కోట్ల కూడలిలో మానవహారం చేపట్టారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ... ఈనెల 10న చేపట్టిన ఆదోని బంద్‌కు ప్రజలు, విద్యాసంస్థలు, దుకాణదారులు విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న సుభాష్ చంద్ర బోస్ మాదిగ


పనులను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

తెర్నేకల్‌లో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - దేవనకొండ

వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ఫీల్డ్ అసిస్టెంట్ మధు ఆధ్వర్యంలో మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. సోమవారం టిడిపి గ్రామ నాయకులు చిన్న వెంకప్ప, నాగేష్, చిన్న రాముడు పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భయపెడుతున్న 'స్క్రబ్ టైఫస్'

- నల్లిని పోలిన కీటకం కుట్టడంతో వ్యాధి
- జ్వరం, వాంతులు, అలసట, దగ్గు వంటి లక్షణాలు
- జ్వరం తగ్గకపోతే పరీక్షలు చేసుకోవాలి : వైద్యులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

స్క్రబ్ టైఫస్ వ్యాధి చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. ప్రాథమిక దశలో గుర్తిస్తే వారం, పది రోజుల్లో బయటపడవచ్చు. నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడంతో స్రబ్ టైఫస్ వ్యాధి సోకుతోంది. 'రికెట్సియా కుటుంబానికి చెందిన 'ఓరియంటియా సుట్సుగముషీ' అనే బ్యాక్టీరియా వల్ల స్రబ్ టైఫస్ వ్యాధి సోకుతుంది. కీటకం కుడితే శరీరంపై నల్లని దద్దుర్లు వస్తాయి. సాధారణంగా ఇళ్లల్లో మంచాలు, దివాన్లపై ఏళ్లుగా వాడే దిండ్లలో ఇటువంటి కీటకాలు చేరుతాయి. నల్లి కుట్టినట్టుగా భావిస్తుంటాం. వారం లేదా రెండు వారాల తర్వాత జ్వరం వస్తుంది. పారాసిటమల్ వేసుకుంటే తగ్గదు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు చేసినా నెగిటివ్ వస్తుంది. పది రోజులైనా జ్వరం తగ్గకపోవడం, శరీరంలో వ్యాధి లక్షణాలు తీవ్రం కావడంతో అకస్మాత్తుగా 100 నుంచి 104 డిగ్రీల జ్వరం, తలనొప్పి, వాంతులు, వళ్లు నొప్పులు, అలసట, దద్దుర్లు ఉంటాయి. కొంతమందిలో కడుపునొప్పి, దద్దుర్లు గోకితే నల్లని మచ్చలు ఏర్పడతాయి. ఆలస్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరిగి కిడ్నీలు, శ్వాస సంబంధిత సమస్యలు, మెదడు, వెన్నెముక సమస్యలు తలెత్తుతాయి.

అంటువ్యాధి కాదు

స్రబ్ టైఫస్ అంటు వ్యాధి కాదు. కీటకం కుట్టిన వారికే పరిమితమవుతుంది. మిగిలిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలు, పొలాల్లో పని చేసేవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్లలో పాతబడిన బొంతలు, దుప్పట్లు, పరుపులు శుభ్రపరుచకోవాలి. ఎప్పటికప్పుడు ఎండలో పెట్టాలి. జ్వరం తగ్గకపోయినా, శరీరంపై నల్లని మచ్చలు వచ్చినా స్రబ్ టైఫస్ ఎలీషా పరీక్ష చేయించుకోవాలి. వ్యాధి సోకిన వారికి యాంటీ బయోటిక్స్ ఇస్తారు. చికిత్స ప్రారంభించిన ఐదు నుంచి వారం రోజుల్లో తగ్గుతుంది. మాత్రలు ఇచ్చిన రెండురోజుల్లోనే తీవ్రత తగ్గుతుంది. మొత్తం కోర్సును తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రధాన లక్షణాలు

ఐదు రోజుల కంటే ఎక్కువ జ్వరం, శరీరంపై నల్ల మచ్చ/ఎస్కార్, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, శ్వాసలో ఇబ్బంది, బలహీనత ఉంటుంది.


గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చికిత్స

డాక్టర్ ఇచ్చే డాక్సీసైక్లిన్, అజీథ్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుంది. జ్వరం ఎక్కువ రోజులు ఉన్నవారు తక్షణం వైద్యులను సంప్రదించాలి.

ఎలా నివారించాలి..?

- సాధారణ ప్రజల కోసం సూచనలు

పొలాలు లేదా గడ్డి ప్రాంతాలకు వెళ్లేప్పుడు పూర్తి చేతుల షర్టులు, పూర్తి ప్యాంట్, మూసి ఉన్న బూట్లు ధరించాలి. చిగ్గర్ కాట్లను నివారించడానికి ఉన్న రిపెలెంట్లు చర్మంపై, బట్టలపై ఉపయోగించాలి. నేలపై కూర్చోవడం, వాలడం అవసరైతే గుడ్డ పరుపు ఉపయోగించాలి. చుట్టుపక్కల గడ్డి, పొదలు తొలగించాలి. మైట్ నివాసాలను తగ్గించడానికి కీటక నాశకాలు ఉపయోగించాలి. ఇళ్ల చుట్టూ శుభ్రత, ఎలుకలను నియంత్రించాలి.

అప్రమత్తత అవసరం

- పెద్దహరివాణం పిహెచ్‌సి వైద్యులు ఇమ్రాన్

స్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు. నిర్లక్ష్యం చేయకూడదు. జ్వరం తగ్గకపోయినా, ఒక్కోసారి 104 డిగ్రీల జ్వరం, ఒంటిపై నల్లని మచ్చలు, అలసట వస్తే వెంటనే స్రబ్ టైఫస్ ఎలీషా పరీక్ష నిర్వహించాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే శ్వాసకోశ వ్యాధి, కిడ్నీ ఫెయిల్ కావడం, లివర్ ఫంక్షన్, కొన్ని అవయవాలు దెబ్బతింటాయి. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకుని, చికిత్స తీసుకోవాలి.

కుర్ని కార్పొరేషన్ ఛైర్మన్‌గా కామార్తి మిన్నప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సంతకం చేస్తున్న కామార్తి మిన్నప్ప

పట్టణంలోని చేనేత సామాజిక వర్గానికి చెందిన చేనేత కార్మికుడు, టిడిపి సీనియర్ కార్యకర్త, పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా సేవలందించిన కామార్తి మిన్నప్ప కుర్ని కార్పొరేషన్ ఛైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... చేనేత కార్మికుల అభివృద్ధికి అవకాశం కల్పించిన టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చేనేతల సంక్షేమం, వారి ఆర్థిక శ్రేయస్సు కోసం ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తూ, ప్రజా సేవలో మరింత చురుకుగా పనిచేస్తానని తెలిపారు. చేనేత రంగం కోసం తన పదవి మరింత బాధ్యతను కలిగించిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాల విస్తరణ, చేనేత కార్మికుల కోసం కృషి చేస్తామని తెలిపారు.

సిఎం దృష్టికి ఆదోని ఉద్యమాలు

ప్రజాశక్తి - ఆదోని


సిఎంకు నివేదిస్తున్న ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ఆదోని జిల్లా ఏర్పాటు ఆవశ్యకత, ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించామని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి వివరాలు వెల్లడించారు. సోమవారం బీటీ.నాయుడు మాట్లాడుతూ... గత కొద్ది రోజులుగా ఆదోనిని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని స్థానికంగా జరుగుతున్న ఉద్యమాలు, దీక్షలు, వివిధ సంఘాలు చేపట్టిన పోరాటాల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆరా తీస్తామన్నారు. ఆదోనికి జిల్లా అయ్యే పూర్తి అర్హతలు ఉన్నాయని, ప్రజల అభ్యర్థనలను, భౌగోళిక, పరిపాలన అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఆదోనిని కొత్త జిల్లాగా ప్రకటించాలని కోరారు.

నాణ్యతకు పెద్ద పీట

- పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

నాణ్యతకు పెద్ద పీట వేసి సిసి రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప తెలిపారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం, సంగాల గ్రామంలో రూ.10 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాణ్యతకు పెద్ద పీట వేసి నిర్మిస్తే పది కాలాల పాటు సిసి రోడ్లు భద్రంగా ఉంటాయన్నారు. నాసిరకానికి తావు లేకుండా నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టు దారులకు సూచించారు. టిడిపి నాయకులు చంద్రశేఖర్, సుంకన్న, రంగనాథ పాల్గొన్నారు.


సంగాల, నేమకల్లు గ్రామాల్లో పనులను పరిశీలిస్తున్న ఎఇ


ప్రతిజ్ఞ చేయిస్తున్న సబ్ కలెక్టర్ అజయ్ కుమార్

బాల్యవివాహాలను అరికడదాం

- సబ్ కలెక్టర్ అజయ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎపి బాల్య రహిత సమాజం కోసం సిడిపిఒ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మైనర్లకు వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలతో పాటు అనర్థాలకు దారితీస్తుందని వివరించారు. వందరోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, విద్యాశాఖ, ఐసిడిఎస్ అధికారులు భాగస్వామ్యం అవుతారన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించడమే కాకుండా పెద్దలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. మూడు విడతలుగా కార్యక్రమ నిర్వహహ ఉంటుందని చెప్పారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, ప్రసన్న, అంజనమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో క్రిస్మస్ పండగ సందర్భంగా ఎబిఎన్ చర్చి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు చంటి, బన్నీ సోమవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.1000 చెల్లించాలని కోరారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి ఎమ్మెల్యే విరుపాక్షి రూ.50,016, రెండో బహుమతి వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డి రూ.35,016, మూడో బహుమతి వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి రూ.25,016, నాలుగో బహుమతి ఎంపిపి భర్త లుముంబా రూ.15,016, ఐదో బహుమతి సర్పంచి అరుణ్ కుమార్ రూ.10,016, ఆరో బహుమతి క్రిస్టియన్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు పులి నరేష్ రూ.5,016 అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9642045942, 9390518706 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కనిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు

- 'పొగ మంచు' కింద పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - హాలహర్వి

ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ వాతావరణం వల్ల వివిధ ఆరోగ్య సమస్యలే కాదు.. వాహన ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. చలికాలంలో తరచుగా పొగమంచు కారణంగానే ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహన చోదకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చలికాలంలో తెల్లవారుజామున ఎటుచూసినా పొగమంచే కనిపిస్తోంది. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. పొగమంచు కురిసే వేళ తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచిదని సూచిస్తున్నారు. కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు సాధ్యమైనంత వరకు అర్ధరాత్రి, తెల్లవారుజాము ప్రయాణాలు మానేయడం మంచిది. మండలంలోని 167వ జాతీయ రహదారిపై క్షేత్ర గుడి నుంచి బళ్లారికి వెళ్లే రహదారిపై రైతులు మొక్కజొన్న, వరి వంటి ధాన్యాలు ఆరబెట్టుకుంటున్నారు. వాటి వల్ల తెల్లవారుజామున పొగమంచు కారణంతో దారి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మంచు పడుతున్నప్పుడు ఫాగ్‌లైట్స్ తప్పనిసరిగా ఉపయోగించాలి. కొన్ని సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించవు. అలాంటప్పుడు అతివేగంతో వాహనం అసలు నడపకూడదు. ఒక్కోసారి రోడ్డుపై పడిన మంచుతో వాహనం జారి పడే ప్రమాదం ఉంటుంది. పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. సాధారణంగా బ్రేక్ వేస్తే కనీసం 50 అడుగుల దూరంలో వాహనం ఆగుతుంది. అతి వేగంగా ఉన్నప్పుడు 90 అడుగుల దూరంలో నిలుస్తాయి. అంటే సడన్‌గా బ్రేకులు వేస్తే ఎలాంటి ఉపయోగమూ ఉండదు. సాధారణ వేగంలో వాహనాలు నడిపితేనే నియంత్రణ సాధ్యమవుతుంది. ఈ కాలంలో వాహన సామర్థ్యం సరిగా ఉండేలా చూసుకోవాలి. 'వైపర్లు సరిగ్గా పని చేస్తున్నాయా, బ్రేకులు సమస్య లేకుండా ఉన్నాయా లేదా' అని చెక్ చేసుకోవాలి. కారులో వెళ్లేటప్పుడు హీటర్ ఉపయోగించాలి. దీనివల్ల ముందు అద్దాలు ఆవిరిపట్టకుండా ఎదుటి వాహనాలను సరిగ్గా గమనించేందుకు వీలు ఉంటుంది. పొగమంచులో డ్రైవింగ్


రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు. రోడ్డుపై ఆగిన లారీ

చేస్తున్నప్పుడు ఓవర్ టేక్ చేయవద్దు. పొగమంచులో దూరాన్ని నిర్ధారించడం కష్టం. ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. ముందున్న ఇతర వాహనాల డ్రైవర్లు పరధ్యానంలో ఉంటే ఢీకొనే అవకాశాలు పెరుగుతాయి. మంచు కురుస్తున్న సమయంలో 'లో బీమ్ హెడ్‌లైట్స్'ను ఉపయోగించాలి. హై బీమ్ హెడ్‌లైట్స్ ఆన్ చేస్తే మంచు తుంపర్లు రిఫ్లెక్ట్ అవుతాయి. ఈ కారణంగా ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. మంచు కురిసే సమయంలో టేల్ లైట్, బ్లింకర్స్‌ను ఉపయోగించడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ కలుగదు. వాహనాలను డ్రైవింగ్ చేసే సమయంలో స్మార్ట్ ఫోన్ వినియోగం, ఎక్కువ సౌండ్‌తో మ్యూజిక్ వినడం లాంటివి చేయకూడదు. వీటివల్ల బయటి శబ్దాలు వినిపించవు. విండోను కాస్తయినా డౌన్ చేయాలి. దీనివల్ల బయట వాహనాల శబ్దాలు వినిస్తాయి. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఉండే వాహనాల మధ్య దూరం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ అవతలి వ్యక్తులు సడెన్ బ్రేక్‌లు వేస్తే, వాహనం కంట్రోల్ కావాలంటే కచ్చితంగా గ్యాప్ ఉండాలి. వాహనాల మధ్య గ్యాప్ ఉండకపోతే.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. వాహనాలకు లైట్ ఇండికేటర్స్ సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి. రోడ్డు లైన్ మారుతున్న సమయంలో లేదా మలుపులు ఉన్న చోట ఇండికేటర్స్ వేయడం ద్వారా ఇతర వాహనదారులను అలర్ట్ చేయొచ్చు. దీనివల్ల అనుకోకుండా జరిగే ప్రమాదాలను తగ్గించవచ్చు. మంచు కురుస్తున్న సమయంలో వాహనాలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదు. ఒకవేళ రోడ్డు పక్కన పార్కింగ్ చేయాల్సి వస్తే ఇండికేటర్స్‌ను ఆన్ చేయాలి. రోడ్ బే, పెట్రోల్ బంకుల వద్ద ఆగడం మంచిది.


ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సహకార ఉద్యోగుల ధర్నా

- కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, వ్యకాస మద్దతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ధర్నా చేపట్టారు. ఉద్యోగ సంఘాల నాయకులు వేణుగోపాల్, దత్తాత్రేయ స్వామి, ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ... సహకార ఉద్యోగులకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ, సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

వైసిపి మద్దతు : సహకార ఉద్యోగుల ధర్నాకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి మద్దతు తెలిపారు. న్యాయం జరిగే వరకూ ఉద్యోగులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. బుట్టా రంగయ్య షబ్బీర్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, షాబుద్దీన్, ప్రభాకర్, దొరబాబు, గిడ్డయ్య, అగ్రహారం రాము, రాళ్లదొడ్డి చాంద్ బాషా, నూర్ బాషా పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- భాష్యం జడ్ఇఒ మాచాని కవిత

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఆదోని భాష్యం-2 పాఠశాల జడ్ఇఒ మాచాని కవిత తెలిపారు. సోమవారం పాఠశాలలో కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రస్థాయి ఆల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-12 విభాగంలో భాష్యం విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. ప్రిన్సిపల్ రవి ప్రకాష్ మాట్లాడుతూ... పిల్లలకు చదువుతోపాటు క్రీడల్లోనూ భాష్యం పాఠశాల గొప్పతనాన్ని చాటుకుంటుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ అంజి, ప్రధానోపాధ్యాయులు మహేశ్వరి, కరాటే మాస్టర్ కేశవ, బలరాం, రఘు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్


ఆటోనగర్ ఏర్పాటు చేయాలి

- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ కోరారు. సోమవారం విజయవాడ మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ... పట్టణంలో ముస్లిం, మైనార్టీలు అధికంగా మెకానిక్ పని చేస్తున్నారని, ప్రత్యేకంగా స్థలం ఏర్పాటు చేసి ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఆటోనగర్ వాసుల అసోసియేషన్ అధ్యక్షులు బషీర్ అహ్మద్, నాయకులు గౌస్ బాష నిజామి, ఎంహెచ్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు హుస్సేన్ అహ్మద్, జిలాని బాష మాట్లాడారు. ఆటో నగర్ ఏర్పాటు చేసి 20 వేల మంది ఆటోనగర్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.


సిఎంకు వినతిపత్రం ఇస్తున్న ఫక్రుద్దీన్


వెంకటరామిరెడ్డిని అభినందిస్తున్న గ్రామస్తులు

పతకాల వీరుడు మొగలి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

పరుగు పోటీల్లో సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించి ఇప్పుడు ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో బంగారు పతకం సాధించి మొగలి వెంకట రామిరెడ్డి దేశానికే గర్వకారణంగా నిలిచారు. నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి, ఉమా దంపతుల కుమారుడు మొగలి వెంకటరామిరెడ్డి పరుగు పోటీల్లో భాగంగా నాలుగో సౌత్ ఏషియన్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025లో కాంస్య పతకం, 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. అలాగే ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఈనెల 4న 800 మీటర్ల పరుగు పోటీలో 1:51.62 సెకన్లలో ముగించి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. రాంచీ వేదికగా జరిగిన నాలుగో దక్షిణ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల పరుగు పోటీలో 1:52.37 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. సోమవారం మొగలి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ... పతకాలను సాధించడంలో తమ గ్రామానికి చెందిన కోచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో చిన్నప్పటి నుంచి శిక్షణ పొందానని, కోచ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. అనంతరం కోచ్ మల్లికార్జున మాట్లాడుతూ... తన శిక్షణలో వెంకట రామిరెడ్డి శిక్షణ పొంది పతకాలు సాధించడం ఆనందంగా ఉందని, గత మూడేళ్ల నుంచి తన ఆధ్వర్యంలో ఆర్మీ సోల్జర్స్‌కు 26 మంది ఎంపికయ్యారని అన్నారు. 2030వ సంవత్సరంలోపు వంద మంది ఆర్మీ సోల్జర్లను దేశానికి అందించడమే తన లక్ష్యమని తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన మొగలి వెంకటరామరెడ్డిని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దావీదు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, గ్రామస్తులు అభినందించారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు

'తల్లికి వందనం' పట్ల సిఐటియు హర్షం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు 'తల్లికి వందనం' పథకానికి అర్హత ఇవ్వడం పట్ల ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తాలూకా అధ్యక్షులు జె.నాగరాజు, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ శాఖ విడుదల చేసిన 'తల్లికి వందనం' జిఒ 26 కాపీని ఇన్‌ఛార్జీ కమిషనర్ అస్లాంకు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు కుటుంబ సభ్యులతో జీవన ప్రమాణాలు తగ్గిపోయాయని తెలిపారు. మున్సిపల్ కార్మికుల పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం జిఒ 26ను విడుదల చేసిందని చెప్పారు. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బి.కేశన్న, బడేసాబ్, గోరు బాష, నరసప్ప, బి.రవి, దేవదాస్, ఈరన్న పాల్గొన్నారు.


జిఒ కాపీని అందిస్తున్న సిఐటియు నాయకులు

పాత నగరం పార్కుల్లో నాసిరకం నిర్మాణం

-మరమ్మత్తుల పేరుతో పార్కుకు తాళాలు
-నాసిరకం నిర్మాణాలపై విచారణ జరిపిస్తాం
-పార్కులు అభివ ద్ధి చేస్తాం: కమిషనర్ హామీ
ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాత నగరంలో పార్కులు తక్కువ. ఉన్న పార్కులో నాసిరకం నిర్మాణాలు చేపడుతూ కోట్ల ప్రజాధనంవృథా అవ్వడంతో పాటు మరమ్మతుల పేరుతో పార్కులకు తాళాలు వేస్తున్నందున ప్రజలకు ఉపయోగపడడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎండి యూనూస్, ఎ.వెంకటేశ్వర్లు,ఇ.లక్ష్మణగౌడు, పి. మురళిల బందం కమిషనర్ దృష్టికి తెచ్చారు. పాములకు, కుక్కలకు, గాడిదలకు నిలయంగా మారిన చల్ల కాంపౌండ్ పార్కుతో పాటు పాత నగరంలో నాసిరకం నిర్మాణాల ఫోటోలను కమిషనర్కు చూపించగా ఫోటోలను చూసిన కమిషనర్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత ఇంజనీర్లను ఎందుకు పరిస్థితి ఇలా తయారైందని ప్రశ్నించారు. పట్టణ పౌరసంక్షేమ సంఘం బృందం నాయకులు మాట్లాడుతూ పెద్ద మార్కెట్ సమీపంలోని పార్కు అభివృద్ధి కోసం రూ.కోటి 17 లక్షలు మంజూరై 4 ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణాలు పూర్తి కాలేదని.. నిర్మించిన కట్టడాలు కూలిపోతున్నాయని తెలిపారు. కొండారెడ్డి బురుజు ఎదుట అసెంబ్లీ ఎన్నికల ముందు కోటికి పైగా వెచ్చించి నిర్మించిన పార్కు మరమ్మతుల పేరుతో తాళాలు వేస్తున్నారని కమిషనర్‌కు తెలిపారు. నాసిరకం నిర్మాణాలపై విచారణ జరిపించి ప్రజాధనం కాపాడడంతోపాటు చల్లా కాంపౌండ్ పార్కు మరమ్మతులను వెంటనే ప్రారంభిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



కమిషనర్‌కు వినతి ఇస్తున్న పుల్లారెడ్డి తదితరులు

కార్పొరేట్‌కు దీటుగా స్టార్ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

-24 గంటలు అందుబాటులో వైద్య సేవలు
-అత్యధికమైన పరికరాలు-అన్ని రకాల వైద్య సేవలు కలవు
ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



స్థానిక గాయత్రి స్టేట్ నందు గల స్టార్ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కార్పొరేట్ కు దీటుగా వైద్యం అందిస్తుందని జనరల్ మెడిసిన్ డాక్టర్ టి శబరి గిరీష్ తెలిపారు. తమ హాస్పిటల్ ప్రత్యేకతల గురించి ఆయన మాటల్లో ఒక్క కార్డియాలజీ, పీడియాట్రిక్ మినహా మిగతా అన్ని రకాల వైద్య సేవలు తమ హాస్పిటల్ లో 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తమ హాస్పిటల్ డాక్టర్లు 10 సంవత్సరాల అనుభవం గల వారు ఉన్నారని తెలిపారు. ఐసియులో మూడు వెంటిలేటర్లు 10 బెడ్లు కలవని ఎలాంటి క్రిటికల్ కేస్ వచ్చిన అందుబాటులో ఉంటామని తెలిపారు. స్టాఫ్ అందరూ అనుభవం కలిగి నిపుణులుగా ఉన్నారని అన్నారు. తాము ప్రత్యేకంగా పాయిజన్ వచ్చిన వారిని అనస్థీషియా సపోర్ట్ వెంటిలేటర్ సపోర్ట్‌తో రికవరీ చేస్తామని చెప్పారు. ఉదయం 9 నుంచి ఓపీలు మొదలవుతాయని తెలిపారు. కార్పొరేట్ కు తగ్గట్టుగా క్రిటికల్ కేర్ లో వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. తమ దగ్గర డయాలసిస్ మిషన్ ఉందని తెలిపారు. తమ దగ్గర ఎన్టీఆర్ వైద్య సేవా సదుపాయం కలదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకుని నాణ్యమైన వైద్యం అందిపుచ్చుకుంటారని ఆకాంక్షించారు.

12 ఏళ్ల పాపకు అడ్రినల్ గ్రంథిలో కేన్సర్

-30-50 ఏళ్లలోపు వారికి రావడం చాలా అరుదు
-కణితితో బీపీ పెరిగిపోయి బాలికకు తలనొప్పి
-లాప్రోస్కోపిక్ పద్ధతిలో కణితిని తొలగించిన కిమ్స్ వైద్యులు
ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నంద్యాల ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలికకు అత్యంత అరుదైన సమస్య వచ్చింది. సాధారణంగా 30-50 ఏళ్ల మధ్యన మాత్రమే వచ్చే అడ్రినల్ గ్రంధి కణితి ఆమెకు చిన్న వయసులోనే వచ్చింది. ఆమెకు చికిత్స చేసి, నయం చేసిన కర్నూలు కిమ్స్ కడల్స్ వైద్యులు తొలగించారు. కన్సల్టెంట్ పీడియాట్రిక్, నియోనాటల్ సర్జన్, పీడియాట్రిక్ యూరాలజిస్ట్ డాక్టర్ సాయిప్రసూన ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న ఆ బాలికకు ఉన్నట్టుండి విపరీతంగా తలనొప్పి వస్తుండడంతో తల్లిదండ్రులు ఆమెను పిల్లల వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ఆమెకు బిపి బాగా పెరిగినట్లు తెలిసింది. కొన్ని రక్తపరీక్షలు చేయగా, పీటీ కూడా ఎక్కువగా ఉంది. సాధారణంగా ఇది 30, 40 ఏళ్లు పైబడినవారిలోనే ఉంటుంది. దాంతో కారణమేంటా అని అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయగా, అడ్రినల్ గ్రంధిలో వాపు ఉన్నట్లు తెలిసింది. అప్పుడు మెరుగైన చికిత్స కోసం కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి తీసుకవచ్చారు. ఇక్కడ ఆమెను పరీక్షించగా, అడ్రినల్ గ్రంధిలో కణితి ఉన్నట్లు తెలిసింది. దాని పేరు ఫియోక్రోమోసైటోమా. ఇది చాలా అరుదుగా ఏర్పడుతుంది. దీనివల్ల శరీరంలో అధికంగా హార్మోన్లు (క్యాటెకోలమిన్స్) ఉత్పత్తి అయ్యి, రక్తపోటు బాగా పెరిగిపోతుంది. దీన్ని అలాగే వదిలేస్తే మరింత సమస్యకు కారణమవుతుంది. దాంతో ఆ బాలికకు ఏర్పడిన కణితి తొలగించాలని నిర్ణయించాం. అప్పటికే



పాపకు బీపీ ఎక్కువగా ఉండడంతో ముందుగా దాన్ని తగ్గించేందుకు అవసరమైన చికిత్సలు చేశాం. బీపీ పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత లాప్రోస్కోపిక్ పద్ధతిలో కణితిని పూర్తిగా తొలగించాం. ఇది క్యాన్సర్ కణితే అయినా, ఇప్పటివరకు ఆమెకు ఇతర అవయవాల్లోకి ఎక్కడా వెళ్లలేదు. పెద్ద వయసులో అయితే అండకోశాలు, ఇతరత్రా అవయవాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. పాపకు వేరే ఎక్కడా ఎలాంటి సమస్య లేకపోవడంతో ఆమెకు రేడియేషన్, కీమోథెరపీ లాంటివి కూడా అవసరం పడలేదు. అయితే, తర్వాత పెద్ద అయ్యేకొద్దీ వేరే రకం క్యాన్సర్లు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల జాగ్రత్తగా ఉంటూ ఎప్పటికప్పుడు వైద్యులకు చూపించుకోవాలి" అని డాక్టర్ సాయిప్రసూన ఉడత తెలిపారు.

ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 అర్జీలు.
టిడ్కో లబ్ధిదారులు పూర్తి డిడి చెల్లించాలి.
ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 28 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఎంఇ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్‌ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి సహకారం అభినందనీయం

రూ.10.64 లక్షలు ఆస్తి పన్నులు వసూలు
ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

నగర ప్రగతికి ప్రధాన ఆదాయ వనరు అయిన ఆస్తి పన్నులను చెల్లిస్తున్న వాణిజ్య సముదాయాల యజమానుల సహకారం అభినందనీయమని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మూడు వాణిజ్య దుకాణాల నుండి వచ్చిన రూ.10,64,111 విలువైన చెక్కులను రెవెన్యూ విభాగ సిబ్బంది కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. ప్రతీ పౌరుడు సమయానికి పన్నులు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓ జునైద్, ఆర్‌ఐలు రాజు, భార్గవ్, సుహేల్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్.

నిఖిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ బాధితుల సహకార సేవ కార్యాలయం లోసంస్థ అధ్యక్షులు మద్దిలేటి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. నేస్తం జిల్లాస్థాయి పాజిటివ్ నెట్వర్క్ అధ్యక్షురాలు బి. సుధారాణి అధ్యక్షత వహించారు. మద్దిలేటి మాట్లాడుతూ మా సొసైటీ తరఫున పేదలకు, ఎయిడ్స్ బాధితులకు వస్త్ర దానం, బెడ్ షీట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే గుర్తిస్తే వారికి కూడా ఇస్తామన్నారు. నేస్తం జిల్లాస్థాయి పాజిటివ్ నెట్వర్క్ కర్నూలు జిల్లా అధ్యక్షులు బి.సుధారాణి మాట్లాడుతూ 2006లో మా సంస్థను ప్రారంభించామన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారిని గుర్తించి ఉచిత సేవలను అందిస్తున్నామన్నారు. పాజిటివ్ ప్రివెన్షన్ కోసం ఎయిడ్స్ బాధితులకు కౌన్సిలింగ్ అవగాహన కల్పిస్తున్నామన్నారు. కళాశాలలో యువతకు అవగాహన కల్పిస్తూ పాజిటివ్ మ్యారేజ్ చేస్తున్నామన్నారు. ట్రీట్‌మెంట్ డిఫాల్టర్ లందరికీ మళ్లీ గుర్తించి ట్రీట్మెంట్ పునఃప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ సహకారంతో సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని అన్నారు. ప్రతినెల స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా 18 సంవత్సరాలలోపు హెచ్ఐవితో ఉన్నవారికి మిషన్ వాత్సల్య స్కీమ్ కింద రూ.4 వేల నుండి రూ.6 వేల వరకు వారికి విద్య, ఆరోగ్యం కోసం ఇప్పిస్తామన్నారు. కేర్ సపోర్ట్ సెంటర్ ఎపిసాక్స్ వారి సహకారంతో పనిచేస్తున్నామని, ఫీల్డ్ లెవెల్‌లో ఎయిడ్స్ బాధితులకు మందులు మానేసి వారికి అవగాహన కల్పించి మందులు ఇప్పించామన్నారు. చైతన్య కళాభారతి ఎన్‌జిఒ విజయ భాస్కర్ నంద్యాల వారి సహకారంతో ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు, న్యూట్రిషన్ కిట్లను, ఎడ్యుకేషనల్ మెటీరియల్‌ను 220మందిమైనార్టీ పిల్లలకు సైకిళ్లు ఇప్పించామన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి న్యూట్రిషన్ కిట్లను కూడా ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ,ఎయిట్ బాధితులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల యూనియన్
ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ జిల్లా అధ్యక్షులు హారీఫ్ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పరిధిలోని పిఎసిఎస్ వారు తమ డిమాండ్స్ పై ఎపి రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కృష్ణనగర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.రమాదేవికి వినతి పత్రం అందించారు. సహకార సంఘాల కర్నూలు జిల్లా ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు హారీఫ్ మాట్లాడుతూ జిఓనెం 36 వెంటనే అమలుపరిచి, 2019, 2024 తాలుకు పెండింగులో ఉన్న వేతన సవరణలు చేసి, అప్పటి వరకు మధ్యంతరభృతి ఇవ్వాలని అన్నారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సీలింగ్ విధించి రూ.2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు చేయాలన్నారు. సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు అమలఅయ్యే రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమాను కల్పించి, ఉద్యోగి సర్వీస్‌లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారం లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. 2019 తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులందరిని పర్మెనెంట్ చేసి, వారికి కూడా హెచ్ఆర్ పాలసి అమలు చేయాలని అన్నారు. సహకార ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చుటకు ఉద్యోగ సంఘాలు రాష్ట్ర వ్యాప్త సమ్మె చేస్తున్నారన్నారు. ఈ సమ్మెకు ఎఐబిఇఎ, ఎపిసిసిసిబిఇఎ యూనియన్లు సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. ఈ సంఘీభావానికి కర్నూలు జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్.విజయ్ సింహారెడ్డి, బ్యాంకు ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. సంఘ సిఇఒలు సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌డ్రైవ్‌ను హైద్రాబాద్ ఎఫెల్‌టెక్ సొల్యూషన్స్ వారు నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవర్ నందు 50 మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపెనీ వారు నిర్వహించిన రాత పరీక్ష గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలలో విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలను సాధించారు. ఈ ఎంపిక ప్రక్రియను కంపెనీకి చెందిన సిఇఒ కిషోర్, హెచ్‌ఆర్‌బి మోహన్ నిర్వహించారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయ లక్ష్మమ్మ అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.సుబ్బారెడ్డి ప్లేస్‌మెంట్ ఇంచార్జ్ ఎం.ఝాన్సీ రాణి, డిపార్టుమెంట్స్ హెచ్‌ఒడిలు పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.